క్లుప్తంగా

తాగునీటి పైప్‌లైన్ ప్రారంభం



ప్రక్కిలంకలో తాగునీటి సరఫరా పైప్‌లైన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంకకు చెందిన భక్తాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సొలస కాశీవిశ్వనాథం రూ.లక్ష వ్యయంతో గోదావరి తాగునీటిని గ్రామస్తులకు అందించే పైప్‌లైన్‌ను ఆ గ్రామ పంచాయతీ ద్వారా నిర్మించారు. తన తల్లిదండ్రులు ఆంజనేయులు, వీరరాఘవమ్మ, సోదరుడు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం కాశీ విశ్వనాథం ఈ పైప్‌లైన్‌ను నిర్మించారు. వైఎస్సార్‌సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు ఆదివారం ఈ పైప్‌లైన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రక్కిలంక గ్రామ నాయకులు నాయుడు హనుమంరావు, ముళ్ల మల్లిబాబు, సొలస మణికంఠ, ఖండవల్లి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

'మానవత' సంస్థకు రూ.80 వేల విరాళం



మానవత సంస్థకు రూ.80 వేల విరాళం చెక్కు అందిస్తున్న దాత

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖకు మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన కొండేపాటి రత్నాజీచౌదరి, ఆయన కుమార్తె రూ.80 వేలు విరాళంగా ఇచ్చారు. రత్నాజీచౌదరి తన తండ్రి వీరకృష్ణ జ్ఞాపకార్థం ఈ మొత్తానికి చెక్కును ఆదివారం మానవత సంస్థ సభ్యులకు అందజేశారు. ఈ మొత్తంతో ఫ్రీజర్ కొనుగోలు చేయనున్నట్టు మానవత సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, కె.నాగరాజు, జి.జోగేంద్రప్రసాద్, రాధాకృష్ణ, కె.కీర్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ పఠనం అల్లాహ్‌ను స్మరించే మార్గం



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

నిడదవోలు: ముస్లింలకు ఖురాన్ పఠనం అల్లాహ్‌ను స్మరించే గొప్ప మార్గమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక మదర్సాలో ఖురాన్ అభ్యసించి ఉత్తీర్ణులైన తొమ్మిది మంది ముస్లిం విద్యార్థులకు ఆదివారం ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు మంత్రి దుర్గేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మదర్సా ప్రెసిడెంట్ మహమ్మద్ మజహర్, ఇమామ్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

వరదలా పొంగుతున్న మద్యం

- విచ్చలవిడిగా బెల్ట్ షాపుల ఏర్పాటు
- మండలానికి ఐదు కేటాయింపు
- 70 వరకూ ఏర్పాటు
- రోజుకు రూ.15 లక్షల మేర అమ్మకాలు



అన్నవరప్పాడు గ్రామంలోని ఓ బెల్ట్ షాపులో విక్రయానికి సిద్ధంగా ఉన్న మద్యం బాటిళ్లు

పెరవలి: గ్రామాల్లో మద్యం వరదలా పారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోను, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ పెరవలి మండలానికి అధికారికంగా ఐదు మద్యం షాపులు మాత్రమే కేటాయించారు. అయితే ప్రస్తుతం గ్రామాల్లో వీధికొకటి చొప్పున మద్యం బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా లిక్కర్ విక్రయాలు సాగిస్తున్నారు. గతంలో షాపు కెళితే కానీ దొరకని మద్యం నేడు ఇంటి పక్కనే ఉండే బడ్డీషాపుల్లోను, కిరణా షాపుల్లోనూ అందుబాటులోకి రావడంతో మందుబాబులు ఖుషీ అవుతున్నారు. మద్యం షాపుల్లో కంటే బెల్ట్ షాపుల్లోనే అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దాంతో షాపుల యజమానులు కూడా బెల్ట్ షాపులకే మద్యాన్ని నేరుగా సరఫరా చేస్తున్నారు. మండలంలోని కానూరు, తీపర్రు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేశారు. మండలంలోని మిగిలిన 14 గ్రామాల్లోనూ గ్రామానికి రెండు నుంచి ఆరు వరకూ బెల్ట్ షాపులను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా రోజుకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.

పత్తాలేని ఎక్సైజ్ అధికారులు

మద్యం షాపుల ఏర్పాటు విషయంలోను, షాపుల యజమానులను సిండికేట్‌గా ఏర్పాటు చేయడంలోనూ ఎక్సైజ్ అధికారులు చూపించిన శ్రద్ధను బెల్ట్ షాపులను నియంత్రించడంలో మాత్రం చూపడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం లైసెన్సు పొందిన మద్యం షాపుల వద్ద మాత్రమే మద్యాన్ని విక్రయించాలి. అందుకు భిన్నంగా మద్యం అమ్మకాలు పెంచుకోవడం కోసం షాపుల యజమానులు ఎవరికిపడితే వారికి బెల్ట్ షాపులు ఇవ్వడంతో అవి కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. అంతేకాదు.. మద్యం షాపుల యజమానులే నేరుగా బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేయడం మరో విశేషం. ఇన్ని జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం దారుణం అనే విమర్శలు వస్తున్నాయి. మండలంలో అధికారికంగా ఐదు మద్యం షాపులు ఉంటే, 70 వరకూ బెల్ట్ బెల్ట్ షాపులు వెలిశాయి.

ఒక్క బెల్ట్ షాపులో రూ.1.80 లక్షల అమ్మకాలు!

మండలంలోని అన్నవరప్పాడులోని ఒక బెల్ట్ షాపులో రోజుకు రూ.1లక్ష నుంచి రూ.1.80 లక్షల వరకూ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం. దీనినిబట్టి మండలంలో మద్యం ఏరులై పారుతోందని అర్థం అవుతోంది. గ్రామాలకు బయట లైసెన్స్ మద్యం షాపులు ఉంటే బెల్ట్ షాపులు మాత్రం గ్రామ నడిబొడ్డున వెలుస్తున్నాయి. గతంలో బెల్ట్ షాపులు ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ఉండేవి. నేడు బహిరంగంగా నిర్వహించడాన్ని చూస్తుంటే ఇది కూటమి పార్టీల బరితెగింపునకు ఉదాహరణ అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఒక్కో బెల్ట్ షాపునకు రూ.రెండు లక్షలు

గోపాలపురం: నియోజకవర్గ పరిధిలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, ద్వారకాతిరుమల మండలాల్లో దాదాపు 300 మద్యం బెల్టు షాపుల ఏర్పాటుకు టీడీపీ నాయకుల పావులు కదుపుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్కో గ్రామంలో మూడు నుంచి నాలుగు చొప్పున బెల్టు షాపుల ఏర్పాటవుతున్నాయి. ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసిన వారికి మాత్రమే బెల్ట్ షాపులను కేటాయిస్తున్నట్టు సమాచారం. ఒక్కో బెల్ట్ షాపు నిర్వాహకుడి వద్ద నుంచి రూ.రెండు లక్షల చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ విధంగా 300 షాపులకు రూ.6 కోట్లు సేకరిస్తున్నారు. ఈ మొత్తమంతా టీడీపీ నాయకుల జేబుల్లో వెళుతున్నట్టు సమాచారం. ఈ వ్యవహారం అంతా ఓ ప్రజాప్రతినిధి ఆదేశాల ప్రకారం జరుగుతోంది. టెండర్లు వేసి వేలంలో మద్యం షాపు దక్కించుకున్న పాటదారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. బెల్టు షాపుల పంపకాల్లో కూటమి పార్టీలైన బీజేపీ, జనసేన పార్టీ నాయకులకు చోటు కల్పించకుండా మొత్తం టీడీపీ నాయకులే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో బీజేపీ, జనసేన నాయకులు టీడీపీ నాయకులపై గుర్రుగా ఉన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మద్యం బెల్ట్‌షాపుల నిర్వహణకు అనుమతులు లేవు. ఒకవేళ ఎక్కడైనా అలా బెల్ట్ షాపులను నిర్వహిస్తే చర్యలు తప్పవు. మద్యం షాపుల సమాచారాన్ని ఎవరైనా మాకు తెలియజేస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకోవడానికి రంగాన్ని సిద్ధం చేస్తున్నాం.

– జైరామ్ సతీష్, ఎక్సైజ్ సీఐ, నిడదవోలు

మద్యం షాపుల వద్ద అనధికార సిట్టింగ్‌లు



తిమ్మరాజుపాలెం మద్యం దుకాణం వద్ద అనధికారిక టెంట్‌లో మద్యం సిట్టింగ్

నిడదవోలు రూరల్: కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాపుల వద్ద సిండికేట్లు అనధికార సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. తిమ్మరాజు పాలెంలోని కోటసత్తెమ్మ ఆలయం వద్ద ఆదివారం నైవేద్యాల సమయంలో కొంతమంది వ్యక్తులు మద్యం సేవిస్తుండడంతో ఆలయానికి కూతవేటు దూరంలో వేలంలో షాపు దక్కించుకున్న సిండికేట్లు మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఈ షాపు వద్ద నిబంధనలకు విరుద్ధంగా టెంట్లు వేసి మందుబాబులకు సిట్టింగ్ అవకాశం కల్పించారు. బహిరంగంగా సిట్టింగ్‌లు ఏర్పా టు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులు



ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

నిడదవోలు: ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా మృతికి ఐఎఫ్‌టీయూ, కేవీపీఎస్, సీపీఎం సంయుక్తంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నివాళులు అర్పించాయి. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబాబాను అక్రమంగా అరెస్టు చేసి అండా సెల్‌లో ఖైదు చేయడంతో ఆయన ఆరోగ్యం క్షీణించిందన్నారు. ఆ విధంగా సాయిబాబా మృతి ప్రభుత్వ హత్యే అన్నారు. సాయిబాబా మరణించినా ఆయన అందించిన విజ్ఞానం, మార్గం ప్రజల్లో దివిటీల్లా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాన్ రాజ్, గెడ్డం రవీంద్రబాబు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఈమని గ్రీష్మకుమార్, బహుజన సేన పార్టీ నాయకులు గుంపుల సత్యకృష్ణ, ఆచంట, ప్రసాద్, సారథి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరాఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: పాలంగి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చివటం గ్రామానికి సోమవారం ఉదయం 8 నుంచి సాయత్రం 4 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్టు ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ ఎన్.నారాయణ అప్పారావు ఆదివారం తెలిపారు.

ఘనంగా అన్న సమారాధనలు

నిడదవోలు రూరల్: దేవీనవరాత్ర మహోత్సవాల ముగింపులో భాగంగా మండలంలోని పెండ్యాల, పందలపర్రు, తాడిమళ్ల గ్రామాల్లో ఆదివారం భారీఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. పెండ్యాలలో ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధనలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేవరపల్లిలో రెండో టౌన్ ఫీడర్ ఏర్పాటు

- ఐదు సెక్షన్లలో ఏబీ స్విచ్‌ల ఏర్పాటు
- తొలగనున్న లో ఓల్టేజీ కష్టాలు



దేవరపల్లిలో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

దేవరపల్లి: దేవరపల్లి వాసుల విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. ఓవర్ లోడ్ వల్ల స్థానికులు నిత్యం లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సుమారు ఆరు వేల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. రోజురోజుకూ దేవరపల్లి విస్తరిస్తోంది. ఒకే ఒక టౌన్ ఫీడర్‌పై మొత్తం సర్వీసులు ఉండడం, వినియోగం ఎక్కువగా ఉండడంతో ఓవర్ లోడ్ సమస్య ఎక్కువగా ఉంది. దీని పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. రెండో టౌన్ ఫీడర్ ఏర్పాటుకు గతంలో ప్రతిపాదనలు పంపించారు. ఎట్టకేలకు 2వ టౌన్ ఫీడర్ మంజూరు కావడంతో రెండు రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. ఇక నుంచి టౌన్ రెండు ఫీడర్లుగా ఏర్పాటు కానున్నాయి. స్థానిక సబ్ స్టేషన్ నుంచి రామన్నపాలెం రోడ్డు వరకూ 2వ టౌన్ ఫీడర్ ఏర్పాటు చేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారి చిలకా వెంకట్రావు తెలిపారు. పట్టణంలో అత్యధిక సర్వీసులు ఉన్నందున ముందుగా టౌన్‌పై దృష్టి పెట్టినట్టు తెలిపారు. పట్టణాన్ని ఐదు సెక్షన్లుగా విభజించి ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏబీ స్విచ్‌లు లేకపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినపుడు సబ్‌స్టేషన్ వద్ద సరఫరా నిలుపుదల చేయవలసి వస్తోందన్నారు. దీని వల్ల పట్టణ ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. ఏబీ స్విచ్‌లు ఉండడం వల్ల ఏ ప్రాంతలో సమస్య వస్తే ఆసెక్షన్ పరిధిలో సరఫరా నిలుపుదల చేయవచ్చుని చెప్పారు. వ్యవసాయ మోటార్ల సర్వీసుల వద్ద రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మల తొలగింపు ఉంటుందని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

కొవ్వూరులో జాతీయ బృందగాన పోటీలు



జాతీయ బృందగాన పోటీల్లో గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు భారత వికాస్ పరిషత్ 62 ఏళ్లుగా కృషి చేస్తోందని ఆచార్య దోర్బల ప్రభాకర శర్మ పేర్కొన్నారు. దేశభక్తిపై విద్యార్థులకు జాతీయ బృందగాన పోటీలను ఆదివారం పట్టణంలోని పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. విశాఖపట్నం, తుని, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కొవ్వూరు, కుమారదేవం గ్రామాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల హిందీ, సంస్కృతం విభాగాల్లో ఎనిమిది బృందాలు, తెలుగులో తొమ్మిది బృందాలు ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ యల్లాప్రగడ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, ఎస్ఎస్ మూర్తి, వంకాయల సన్యాసిరావు, తాడోజు సాయికృష్ణ, సౌత్ రీజినల్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమ శాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

ఉండ్రాజవరం: దసరా ఉత్సవాలు ముగియడంతో తాడిపర్రు గ్రామంలోని అమ్మవారి ఊరేగింపు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో ఏర్పాటు చేసిన బుట్టబొమ్మలు, కాళికాదేవి వేషాలతో పాటు వివిధ రకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఆకట్టుకొనేలా ఏర్పాటు చేశారు. పలువురు భక్తులు అమ్మ వారికి దర్శించుకున్నారు.



ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారు

సీసీ రోడ్లకు శంకుస్థాపనలు



దేచెర్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు: ఐ.పంగిడి పంచాయతీ పరిధిలోని దేచెర్ల గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే కుమారదేవంలో రూ.15 లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్డుకు కూడా ఆయన శంకుస్థాపన చేసి, శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ గోశాల నాగర్జున, మాజీ ఎంపీపీ పీకే రంగారావు, ఎంపీడీవో కె.సుశీల, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, పెద్దేవంలో రూ.22 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ యాళ్ల స్వప్న, వివిధ పార్టీల నాయకులు, ఎంపీడీవో వెంకటరమణ, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ త్రిమూర్తులు, ఏపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.50 వేల విరాళం

తాళ్లపూడి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని టాటా వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలోని అరుణజ్యోతి బయో వెంచర్స్ ప్రతినిధి ఎ.మధు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. ఆదివారం మండలంలోని ప్రక్కిలంకలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త జీవీ ప్రసాద్‌లకు ఈ మేరకు చెక్ అందజేశారు.

యువతను ఆధ్యాత్మికత వైపు నడిపించాలి

- నల్లజర్లలో సమరసత సేవా ఫౌండేషన్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న మూడు మండలాల సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్లు

నల్లజర్ల: యువతను ఆధ్యాత్మికత వైపు నడిపించేలా సమరసత సేవా ఫౌండేషన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ కొవ్వూరు డివిజన్ ధర్మ ప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు సూచించారు. సమరసత సేవా ఫౌండేషన్ నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు మండలాల గ్రామకన్వీనర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నల్లజర్ల శివాలయంలో నిర్వహించారు. సమావేశంలో మాధవరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ 20 మంది సభ్యులతో ధార్మిక సమితులు ఏర్పాటు చేయాలన్నారు. అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవడం, ఇతర మతాల్లోకి మారిన వారికి హిందూధర్మం విశిష్టత గురించి తెలియజెప్పి తిరిగి హిందూ ధర్మంలోకి ఆహ్వానించాలన్నారు. ప్రతి గ్రామంలో భజన మండళ్లు ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ కర్రి శ్రీనివాసరావు, బలుసు సత్యనారాయణ, పావులూరి జ్యోతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలే..

- అధ్వానంగా నిడదవోలు – పంగిడి రహదారి
- తరచూ వాహనదారులకు ప్రమాదాలు
- స్థానికులే గోతులు పూడ్చుకున్న వైనం
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు



ఎస్. ముప్పవరం వద్ద రోడ్డుపై పడిన గోతులు

చాగల్లు: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నిడదవోలు– పంగిడి ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి మండలంలో చాలావరకూ ఛిద్రమైంది. సుమారు 12 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు పలుచోట్ల దారుణంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులమయంగా మారింది. పైకి లేచిన నల్లకంకర రాళ్లు వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. ఈ రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో పడి చాలామంది ప్రయాణికుల గాయాలపాలవుతున్నారు. అయినప్పటికీ ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ రహదారికి మరమ్మతులు చేపట్టినప్పటికీ పనుల్లో నాణ్యత లోపించిందంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై పడిన గోతుల్లో క్వారీడస్ట్‌తో తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారని, కొద్దిరోజులకే మళ్లీ గోతులు ఏర్పడుతున్నాయని విమర్శిస్తున్నారు. ప్రధానంగా సిమెంట్ రోడ్డు, బీటీ రోడ్ల జాయింట్ల వద్ద గోతులు పడ్డాయి. వాటిని గమనించిన వాహన చోదకులు ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. చాగల్లు శివార్లలోని జూనియర్ కళాశాల సమీపంలోని గోతుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

స్థానికుల చొరవతో గోతుల పూడ్చివేత

బ్రాహ్మణగూడెం సెంటర్లో గోతులు ఎక్కువగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిస్థితిని గమనించిన ఆ గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ తెచ్చి, ఆ గోతులను పూడ్చారు. నిడదవోలు– పంగిడి మార్గంలో బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, మీనానగరం, చాగల్లు, ఊనగట్ల, గ్రామాల్లో ఏర్పడ్డ గోతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తాత్కాలికంగా కాకుండా పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



బ్రాహ్మణగూడెం సెంటర్లో ఛిద్రమైన రహదారి



బ్రాహ్మణగూడెం సెంటర్లో రోడ్డు గుంతలను స్థానికులు ఇటుక ముక్కలతో పూడ్చిన తర్వాత

మరమ్మతులు చేపట్టండి



ఈ రహదారిపై గుంతలు ఎక్కువగా ఉండడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడినపుడు గుంతల్లో నీరు చేరడంతో ప్రమాదాలకు గురవుతున్నాం. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని కనీసం రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– బి.రజనీ ప్రసాద్, మీనానగరం

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం



ఝాన్సీ వైద్య ఖర్చులకు నగదు సాయం చేస్తున్న నాయకులు

కొవ్వూరు: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కోడి ఝాన్సీకి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం, మాదిగ సోదరుల ఐక్యవేదిక గ్రూపు ద్వారా రూ.21,700 ఆర్థిక సాయం అందజేసినట్టు ఆ సంఘ నాయకుడు పెనుమాక జయరాజు తెలిపారు. రాజమహేంద్రవరం బొల్లినేని (కిమ్స్)లో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించి ఈ ఆర్థిక సాయం సొమ్మును ఆమె కుటుంబ సభ్యులను అందజేశామన్నారు.బాధితురాలు చాగల్లు గ్రామానికి చెందిందన్నారు. మెరిపో జలమయ్య, మధుశేఖర్, కొడమంచిలి సత్యనారాయణ, గెల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ అయ్యేనా?

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల వేళ కూటమి పార్టీలు అమలు కాని హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసగించాయని పీసీసీ మాజీ కార్యదర్శి జేష్ఠ సతీష్‌బాబు విమర్శించారు. గోపాలపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. గృహ నిర్మాణ అవసరాలకు తాను ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునేందుకు వారం రోజులుగా ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రయోజనం లేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి మద్యం వ్యాపారంపై దృష్టి సారించడం సిగ్గు చేటన్నారు.